



యాదవానందస్వామిని సన్మానిస్తున్న సీఎం సిద్దరామయ్య

సాఫీగా సంక్షేమం..!



● రాష్ట్రంలో ముగిసిన ఆర్థిక సంవత్సర అంచనాలు ● 12 శాఖల్లో సంపూర్ణ ప్రగతి ● మిగతా వాటిలోనూ పురోగతి

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఐదుగ్యారెంటీల అమలుకు ఏటా అర లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా రాష్ట్రంలో సంక్షేమ పనులు సాఫీగా సాగుతున్నాయి. 12 శాఖల్లో సంపూర్ణ ప్రగతి సాధ్యమయ్యింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు విడుదల చేసే విషయంలో ప్రభుత్వం విఫలమైంది. ఆర్థిక సంవత్సరం ముగిసినా సుమారు 31,491 కోట్ల రూపాయలు విడుదల చేయలేకపోయారు. ఇలా భారీగా గ్రాంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. 2024-25 బడ్జెట్‌లో శాఖలవారీగా కేటాయించిన గ్రాంట్లు మార్చి నెలాఖరులోగా విడుదల చేయాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులు కాస్త ఆలస్యమైనా ప్రభుత్వం బడ్జెట్‌కు అనుగుణంగా ఆర్థికశాఖ ద్వారా సంబంధితశాఖలకు గ్రాంట్లను విడుదల చేయాలి.



ఐదు గ్యారెంటీల అమలు

గతంలో ఎన్నడూలేనివిధంగా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. 2023 ఎన్నికలకు ముందు ప్రజలకు ఐదు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2023 మే నెలలో సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగా ఆ తర్వాత ఒక్కొక్కటిగా గ్యారెంటీలను అమలు చేస్తూ వచ్చారు. 2023 జూన్ నుంచి శక్తి గ్యారెంటీకి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత అన్నభాగ్య గ్యారెంటీ ద్వారా ప్రతి బీపీఎల్ కార్డుదారుడికి 5 కేజీల బియ్యం ఇవ్వాలని నిర్ణయించారు. బియ్యం సమకూర్చుకునేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. దేశమంతా కరువు ఉండడంతో అవసరమైనంత బియ్యం లభించలేదు. పైగా ఉత్తరభారత దేశంలో అందుబాటులో ఉన్నా రవాణా ఖర్చు భారమని వెనుకడుగు వేశారు. ఇలా మూడు నెలల తర్వాత బియ్యానికి బదులుగా నగదు బదిలీ అమలు చేశారు. ఆ తర్వాత గృహ లక్ష్మి గ్యారంటీ ద్వారా కుటుంబ పెద్ద అయిన మహిళకు నెలకు రూ.2వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక గృహజ్యోతి పేరిట ఉచిత విద్యుత్ అమలు చేశారు. 2023 డిసెంబరు తర్వాత యువనిధి గ్యారెంటీని ప్రారంభించారు. దీంతో ఐదు గ్యారెంటీలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖజానాపై భారం పడలేదు. కానీ 2024-25లో ఏడాదిపాటు ఐదు గ్యారెంటీలు అమలు చేయాల్సి వచ్చింది. ఇలా బడ్జెట్‌లో రూ. 56వేల కోట్ల రూపాయలు కేటాయించాల్సి వచ్చింది.

12శాఖల్లో వందశాతం ప్రగతి

బడ్జెట్ గ్రాంట్లలో నిధులను 12శాఖలు సంపూర్ణంగా వినియోగించాయి. వీటిలో పశుసంవర్ధకశాఖ రూ.3165 కోట్లు, సిబ్బంది పాలనా వ్యవహారాలు 1409 కోట్లు. అటవీశాఖ 2487 కోట్లు, సాంఘిక సంక్షేమం రూ.5,651 కోట్లు ఖర్చు చేసి వందశాతం ప్రగతి సాధించాయి. పర్యాటక శాఖ రూ.379 కోట్లు, ప్రజాపనులశాఖ 11,275 కోట్లు, చిన్ననీటిపారుదలశాఖ 2694 కోట్లు, విద్యుత్‌శాఖ 23,179 కోట్లు, కన్నడ సంస్కృతిశాఖ 293 కోట్లు, వాణిజ్య పరిశ్రమలశాఖ 1138 కోట్లు, రెవెన్యూశాఖ రూ.14,894 కోట్లు (విపత్తు నిర్వహణ విభాగం), సమాచారశాఖ రూ.364 కోట్లు ఖర్చు చేశాయి సంపూర్ణ ప్రగతిలో ఉన్నాయి.

విడుదల కాని రూ.31,490 కోట్లు

2024-25 బడ్జెట్‌లో కేటాయించిన గ్రాంట్లకు సంబంధించి రూ.31,490 కోట్లు విడుదల కాకుండానే నిలిచిపోయింది. కర్ణాటక డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్ (కేడీపీ) ప్రగతి గణాంకాల ప్రకారం బడ్జెట్‌లో 84.79శాతం ఆర్థిక ప్రగతి సాధ్యమైంది. 2024-25 సంవత్సరంలో శాఖలవారీగా 3,22,045.81 కోట్ల రూపాయల గ్రాంట్లను కేటాయించారు. వీటిపైకి బడ్జెట్ సంవత్సరం ముగింపు 2025 మార్చినాటికి రూ.2,90,547.68 కోట్లను విడుదల చేశారు. కేడీపీ గణాంకాల ప్రకారం మార్చి చివరినాటికి అన్నిశాఖలకు రూ.2,73,077.50కోట్లు ఖర్చు చేశారు. మొత్తం విడుదలైన గ్రాంట్లలో 17,470 కోట్ల రూపాయలు సద్వినియోగం కాలేదు. ఇక బడ్జెట్ గ్రాంటు కేటాయింపుల ప్రకారం 84.79శాతం ఖర్చు చేశారు. 90శాతం గ్రాంట్లు విడుదల చేశారు.

21శాఖల్లో 80 శాతానికి పైగా..

2024-25 ఆర్థికసంవత్సరంలో 21శాఖలో 80-98శాతం ప్రగతి సాధించాయి. ఆర్థికశాఖ రూ.34,157 కోట్లు గ్రాంట్లలో 31,203 కోట్లు ఖర్చు చేసింది. రవాణాశాఖ రూ.6,534 కోట్లకుగాను 6455 కోట్లు ఖర్చు చేయగా మౌలిక సదుపాయాల విభాగం 952 కోట్లకుగా రూ.908 కోట్లు, సహకారశాఖ రూ.2297 కోట్లకుగాను 2133 కోట్లు ఖర్చు చేశాయి. వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ రూ.3,489 కోట్లకుగాను రూ.3,476 కోట్లు ఖర్చు చేసింది. మైనారిటీ సంక్షేమం 3వేల కోట్లలో రూ.2946 కోట్లు ఖర్చు చేసింది. రెవెన్యూశాఖ రూ.3053 కోట్లకు గాను రూ. 2,844 కోట్లు, ఉన్నత విద్యాశాఖ రూ.5,771 కోట్లకుగాను రూ.5,192 కోట్లు, వైద్య విద్యాశాఖ రూ.4,331 కోట్లకుగాను రూ.4,315 కోట్లు, ఎస్టీ అభివృద్ధిశాఖ రూ.1,718 కోట్లకుగాను 1,499 కోట్లు, నగరాభివృద్ధిశాఖ రూ.19,715 కోట్లకు గాను రూ.17,181 కోట్లు, జలవనరుల శాఖ రూ.16,832 కోట్లకుగాను రూ.15,477 కోట్లు ఖర్చు చేశారు.

8 శాఖల్లో 75 శాతంలోపు..

కేడీపీ గణాంకాల ప్రకారం 8 శాఖల్లో 75శాతంలోపు ప్రగతి నమోదైంది. గృహనిర్మాణశాఖలో రూ.4452 కోట్లకుగాను 2638 కోట్లు (59శాతం) ఖర్చు చేశారు. గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ రూ.25,084 కోట్లకుగాను రూ.13,393 కోట్లు (53శాతం) ఖర్చు చేశారు. నైపుణ్యాభివృద్ధిశాఖలో రూ.2,322 కోట్లకుగాను రూ.1539 కోట్లు (66శాతం), స్త్రీశిశుసంక్షేమశాఖలో రూ.34,406 కోట్లకుగాను రూ.22,528 కోట్లు (65శాతం), పౌర ఆహార సరఫరాల శాఖలో రూ.9,978 కోట్లకుగాను 7,579 కోట్లు (75శాతం) ఖర్చు చేశారు. ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్న శాఖలకే అధిక నిధులు కేటాయించారు.

విద్య, పోరాటం.. వెనుకబడిన వర్గాలకు మూలమంత్రం కావాలి

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించినట్టుగా సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, పోరాటాలు మూలమంత్రం కావాలని అప్పుడే బానిసత్వం నుంచి బయట పడడం సాధ్యమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బెళగావి జిల్లా చిక్కోడిలో కర్ణాటక రాష్ట్ర గొల్ల సంఘం శతమానోత్సవం, యాదవానంద స్వామి 16వ పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. యాదవసంఘానికి నూరేళ్ల కావడం సంతోషించే విషయమన్నారు. గొల్ల కులస్థులను సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎంతోమంది సాధకుల కష్టం ఉందన్నారు. కులవృత్తితో నిర్మితమైన సంఘాలు అంచెలంచెలుగా ఎదిగాయన్నారు. విద్య, సమైక్యం, పోరాటం ముఖ్యం కావాలని కులస్థులకు పిలుపునిచ్చారు. మనుస్మృతి పాలనతో సమాజంలో బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర అని విభజించారన్నారు. సమానత్వంతో సమాజాభివృద్ధి సాధ్యమనే లక్ష్యంతో కులగణన జరిపించామన్నారు. 1918లోనే నాల్వడి కృష్ణరాజ ఒడయార్ విద్య, ఉద్యోగాలలో సమానత్వం ఉండాలనే మిల్లర్ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. బ్రాహ్మణేతర కులాలకు 75శాతం రిజర్వేషన్‌ను కల్పించారన్నారు. గొల్ల సమాజానికి ప్రత్యేక కార్పొరేషన్ కావాలనే డిమాండ్ ఉందని పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు.

అంతకుముందు బెళగావిలో వ్యవసాయశాఖ సహాయధనంతో రూ.400కోట్ల విలువైన వ్యవసాయ యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. పౌరకార్మికులను రెగ్యులర్ చేస్తామనే హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా బెళగావి నగరం టిలకవాడిలో బహుళ అంతస్థుల కళామందిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు.




మెజస్టిక్‌లో చిరుజల్లులు

బెంగళూరు సహా పలు జిల్లాల్లో వర్షం

● తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు
● పలు ప్రాంతాల్లో నేలరాలిన పంటలు

-7లో



జవాబు పత్రంలో రాస్తూ.. రూ.500 అంటించిన ఓ విద్యార్థి

లవ్ ఫెయిల్..!

● పాస్ కాకపోతే ప్రేమ విఫలమవుతుంది..
● ఇంట్లో చదువు ఆపేసి పెళ్లి చేస్తారని మరొకరు...
● పదో తరగతి జవాబు పత్రాల్లో విద్యార్థుల వేడుకోలు
● సోషల్ మీడియాలో వైరల్‌పై అధికారుల ఆగ్రహం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సార్ మార్కులు వేసి పాస్ చేయండి..లేదంటే లవ్ ఫెయిల్ అవుతుందని ఒకరు..ఇంట్లో చదువు ఆపేస్తారని మరొకరు ఇలా పదవ మాస్టార్లను వేడుకున్న జవాబు పత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవల 10వ తరగతి విద్యార్థులు... సొంత కవిత్వాలు రాయడం తరచూ బయట పడుతోంది. ఎలాగైనా పాస్ చెయ్యాలని ఒకరు రాస్తుంటే... తాను 10వ తరగతి పరీక్షల్లో పాస్‌కాకపోతే తన ప్రేమ విఫలం అవుతుంది... పాస్ చెయ్యండి ప్లీజ్ అంటూ... జవాబు పత్రంలో వేడుకున్న ఘటన.. ప్రస్తుతం వైరల్ అవుతోంది.

బెళగావి జిల్లా, పరిధిలోని చిక్కోడి తాలూకా నిప్పాణి కేంద్రంలో 10వ తరగతి వ్యాల్యుయేషన్ జరుగుతుండగా.. ఓ విద్యార్థి జవాబు పత్రంలో రాసిన జవాబు అందరినీ ఆశ్చర్యపరిచింది... అందులో.. రూ 500 అన్సర్ షీట్‌కు కి అంటించడంతో పాటు 'తనను పాస్ చేయాలని లేకుంటే తన ప్రేమ విఫలం అవుతుందని, తాను పాసైతేనే తన ప్రేయసి ప్రేమిస్తానంటోందని" రాశాడు. మరో జవాబు పత్రంలో ఓ విద్యార్థిని కూడా ఇదే రీతిలో వేడుకోవడం గమనార్హం.. సర్/మేడమ్... తనను పాస్ చేయాలని, లేకపోతే ఇంట్లో తన చదువు ఆపేసి పెళ్లి చేస్తారని వేడుకుంది.

సోషల్ మీడియాలో ఉంచడం సరికాదు : డీడీపీఐ సీతారామ్

బెళగావి జిల్లాలో ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు అన్సర్ షీట్‌లో ప్రత్యేకంగా మనవి చేసుకుంటున్న వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. డీడీపీఐ ఆర్.ఎస్. సీతారాము మాట్లాడుతూ ఇలాంటి తమ జిల్లాలో చోటుచేసుకోలేదని, ఇది సత్యానికి దూరమని, ఒకవేళ విద్యార్థులు ఈ రకంగా జవాబు పత్రంలో కోరినా... దానిని ఫొటోలు తీసి షేర్ చేయడం సరికాదన్నారు. సోషల్ మీడియా, యూట్యూబర్లు ఇలాంటి వాటిని పోస్ట్ చేయరాదని కోరారు. ఈ విషయంపై విచారణ జరుపుతామన్నారు.

లౌకిక సమాజంలో కులాల విభజన సరికాదు

● సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగరక్షణ, లౌకిక సిద్ధాంతాలను ప్రతిపాదించే సమాజంలో కులాలను విభజించడం సరికాదని హరిహరపుర మఠం స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అభిప్రాయపడ్డారు. ఆదివారం బెంగళూరు జయనగర్ అయోధ్య కల్యాణమండపంలో తిరుమల తిరుపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 'నరుడి నడక నారాయణుడివైపు' అనే నినాదంతో 48వ వార్షిక మండలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య సంఘర్షణ ఎదురయ్యిందన్నారు. కులం కంటే మతం ముఖ్యం అనుకుంటేనే దేశం మనుగడ సాధిస్తుందన్నారు. కులం అనేది వృక్షమైతే మతం తల్లి వేరులాంటిదన్నారు. కులాల వ్యామోహంలో మతంపట్ల కూడా నమ్మకాన్ని వీడరాదన్నారు. జీవన వాస్తవాలను తెలుసుకోవాలని, అనిశ్చితి నుంచి బయటకు రావాలని, వ్యాపార మనస్తత్వం వీడి భగవంతుడి పట్ల భక్తితో జీవితంలో ఎదగాలన్నారు. భారతీయ సంస్కృతి కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ట్రస్టు అధ్యక్షులు వెంకటగిరిగౌడ, కార్యదర్శి శాంతరాజు, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు డాక్టర్ ఎం జయప్రకాశ్, బీజేపీ నాయకుడు ఆర్ జయదేవ్‌లు పర్యవేక్షించారు.



మండలోత్సవంలో పాల్గొన్న సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

24న మలె మహదేశ్వరలో కేబినెట్ సమావేశం

● ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలెమహదేశ్వర కొండపై ఈనెల 24న గురువారం కేబినెట్ సమావేశం జరగనుంది. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ మొదటివారంలోనే నిర్ణయం తీసుకున్నందుకు అనుగుణంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రతివారం బెంగళూరులో కేబినెట్ భేటీ జరిపే సంప్రదాయం ఉంది. కానీ వివిధ ప్రాంతాల్లో కేబినెట్ భేటీ ద్వారా ఆ జిల్లాల సమస్యలపైనా చర్చకు అవకాశం ఉంటుందనే ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవలే కలబురగిలో సమావేశం జరిపారు. చామరాజనగరలో మంత్రివర్గ సమావేశానికి సంబంధించి మూడు నెలలుగా వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు తేదీ ఖరారైంది. మంత్రివర్గ సమావేశానికి సీఎంతోపాటు మంత్రులందరూ పాల్గొంటున్నందున అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. హెలీప్యాడ్ తోపాటు ఇతరత్రా సౌలభ్యాలపై జిల్లాయంత్రాంగం సిద్ధమైంది. జిల్లాధికారి శిల్పానాగ్, ఎమ్మెల్యే ఎంఆర్ మంజునాథ్ తదితరులు ఆదివారం సమీక్ష జరిపారు.



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా అధికారి శిల్పానాగ్



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ ఖాజాహుస్సేన్

కూలీలను కుక్కేశారు..!

● గూడ్స్ వాహనంలో 16 మంది తరలింపు ● కేసు నమోదు చేసిన పోలీసులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 16 మంది కూలీలను గూడ్స్ ఆటోలో తరలిస్తుండడాన్ని చూసి పోలీసులు షాక్‌కు లోనయ్యారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో విడపనకల్లు పోలీసులు అనంతపురం ఎస్పీ జగదీష్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక నుంచి ఆంధ్రకు గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలిస్తున్న ఆటోలపై విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ కొరడా ఝుళిపించారు. రెండు గూడ్స్ వాహనాలపై కేసు నమోదు చేసి గుంతకల్లు ఆర్టీఓ అధికారులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... లగేజీ ఆటోల్లో కూలీలను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఇకపై రోజూ తనిఖీలు నిర్వహిస్తామని, పట్టుబడితే ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతపురం ఎస్పీ ఆదేశాలతో గూడ్స్ వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

ఎండుతున్న చెరువులు..!

● బాగేపల్లి తాలూకాలో నీటికోసం తహతహ ● కాలువ ద్వారా మళ్లించాలని డిమాండ్

బాగేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో ముంగారు వర్షాలు కురవలేదు.. హెచ్ఎన్ వ్యాలీ నీరు చెరువులకు మళ్లించలేదు.. దీంతో అందరి దాహం తీర్చే చెరువులు, కుంటలు నోరెళ్లబెట్టుకుని దీనంగా చూస్తున్నాయి. దీంతో ప్రజలు, పశుపక్ష్యాదులు నీటి కోసం తహతహలాడే పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ నెలలో ఎండల తాపం పెరిగింది. తాలూకావ్యాప్తంగా చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోయింది. బిళ్ళూరు గ్రామంలోని వండమాన్, పరగోడు చిత్రావతి, గంట్లమల్లమ్మ డ్యాంలు సహా చెరువులు, కుంటలు, కాలువలలో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాలతో డ్యాంలకు నీరు చేరింది. ఇలా ఏడాది తర్వాత నీటికుంటలలో భూగర్భజలాలు పెరిగాయి. ఆ తర్వాత ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు.

బోర్లలో నీరు లేవు..

వందల అడుగులనుంచి వేల అడుగులకు బోర్లు తవ్వినా చుక్క నీరు లభించేది కష్టంగా మారింది. బోర్లకోసం లక్షల రూపాయలు ఖర్చు చేసినా లాభం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాలూకాలోని రైతులు వ్యవసాయం, కూరగాయల సాగుచేసేందుకు నీటి కొరతతో సతమతమవుతున్నారు. బోర్లు, బావుల్లోనూ నీటి ఎద్దడి వెంటాడుతోంది. పాడిపైనే ఆధారపడ్డ రైతులు సైతం నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. నీటి కొరతతో పలు భూములు బంజరుగా మారిపోయాయి. ఒకవేళ ఎంతో కొంత నీరు లభించి సాగు చేయాలని ప్రయత్నించినా వ్యవసాయ కూలీలు లభించడం లేదు.

సాగు కష్టమే..


తాలూకాలో ప్రధానంగా రాగి, వరి, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేస్తారు. టమోటా, బీన్స్, కోసు, ముల్లంగి, క్యారెట్, కొత్తిమీర, పుదీనా వంటి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తారు. డ్రిప్ ఇరిగేషన్‌కు కూడా నీరు తగినంతగా సరిపోవడం లేదు. కుంటలు, చెరువులు ఎండిపోయి కొన్నిచోట్ల చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి.

తాలూకాలో ఎటువంటి నది, కాలువలు లేవు. కేవలం వర్షాధారితంగానే రైతులు వ్యవసాయం, కూరగాయలు పండిస్తున్నారు. పంటలు సాగు చేయాలనే ఆసక్తి ఉన్నా శాశ్వతమైన నీటి వనరుల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది వ్యవసాయ పనులను వీడి బెంగళూరు తదితర నగరాలకు వలస వెళ్తున్నారు. తాలూకాలోని గూళూరు, మిట్టేమరి, పాతపాళ్య హోబళి గ్రామాలు, తండాల్లో రైతులు ఉన్నారు. అయితే నీటి కొరత కారణంగా సాగు చేయలేక కూలీలుగా మారక తప్పడం లేదు. ఉదయమే గ్రామాలను వీడి పట్టణ శివారు ప్రాంతాల్లో సిమెంటు, ఇటుక, వడ్రంగి, ఇంటిపని, తోట పనులలో కూలీలుగా వెళ్తున్నారు.

నంజుండప్ప నివేదిక అమలుకు డిమాండ్

డాక్టర్ డీఎం నంజుండప్ప నివేదిక ప్రకారం అత్యంత వెనుకబడిన తాలూకాల్లో బాగేపల్లి ఒకటి. తాలూకా సరిహద్దులోనే ఆంధ్రప్రదేశ్ చెక్‌పోస్టు ఉంది. చిలమత్తూరు, హిందూపురం, పుట్టపర్తి, సోమందేపల్లి తదిర గ్రామాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణానది నీటిని కాలువల ద్వారా అందిస్తోంది. కృష్ణానది నీటిలో తాలూకా వాటా ఉంది. రాష్ట్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి కృష్ణానది నీటి వాటాను తాలూకాలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం 15 కిలోమీటర్ల దూరంనుంచి కాలువ ద్వారా నీటిని మళ్లించవచ్చు. తద్వారా ఈ ప్రాంత డ్యాంలు, చెరువులు, కుంటలు నిండుకుంటాయి. ప్రజలకు, పశుపక్ష్యాదులకు శుద్ధతాగునీరు, సాగు నీటి అవసరాలు తీరుతాయి.

బెంగళూరు హెచ్ఎన్‌వ్యాలి మూడోదశ నీటిని శుద్ధీకరించి తాలూకాలోని చెరువులకు మళ్లించే పథకం ఇంకా అమలుకు నోచుకోలేదు. తాలూకాలోని మిట్టేమరి గ్రామం నుంచి మల్లిగుర్కి గ్రామం చెరువు వద్ద గతంలో ఎంపీ డాక్టర్ ఎంపీ వీరప్పమొయిలీ, ప్రస్తుత ఎమ్మెల్యే సుబ్బారెడ్డి భూమిపూజ చేసి సంవత్సరాలు గడుస్తున్నాయి. పైపు ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. అయితే నీరు వదల్లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి తాలూకాలో శాశ్వత నీటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.



పాతపాళ్య హోబళి ఆకతమడక గ్రామంలో ఎండిపోయిన మంచినీటి చెరువు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.51	1,578.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	349	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	380	112
నీటి నిల్వ (టీఎంసీలు)	7.01	3.86

సండూరులో తీవ్రమైన నీటి సమస్య

● వారానికోసారి కూడా రావడం లేదంటున్న స్థానికులు ● ట్యాంకర్లతో అరకొరగా సరఫరా



ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సండూరు పట్టణంలో నీటికోసం కష్టాలు తీవ్రంగా మారాయి. ముఖ్యంగా 3, 4, 5, 6, 14వ వార్డులు, మరాఠా సమాజ్ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా మారింది. ప్రజలు తమ రోజువారీ పనులను మానుకుని నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. నారిహళ్ల జలాశయం నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఉన్నప్పటికీ మున్సిపాలిటీ ప్రతి 14,15 రోజులకు నీరు వదులుతున్నారు. 14వ వార్డులోని చప్పరడ్లీ, 2వ వార్డులో సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని ఇతర వార్డులలో నీటి సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. పట్టణంలో మొత్తం 23వార్డులు ఉన్నాయి. జనాభా 50,000 కంటే అధికంగా ఉన్నారు. అర్బన్ వాటర్ సప్లై బోర్డు సూచనల ప్రకారం సండూర్ పట్టణంలో రోజువారీ 65.67లక్షల లీటర్ల నీటి డిమాండ్ ఉంది, దానికి అనుగుణంగా సరఫరా చేయాలి. కానీ మున్సిపాలిటీ కేవలం 2.5 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు ట్యాంకర్ల కొరత, నిరంతరం మరమ్మతులో ఉన్నపాత పైప్‌లైన్, రిజర్వాయర్‌వద్ద విద్యుత్తు సమస్యల కారణంగా పట్టణంలో నీరు సకాలంలో అందడంలేదు. ప్రతి వేసవిలో నీటి కష్టాలు తప్పడం లదేని స్థానికుడు ఖలందర్ వాపోయారు. ట్యాంకర్ల కొరత, విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వల్ల పట్టణంలో తగినంతనీరు అందడం లేదు. అవసరమైన వార్డులకు ట్యాంకర్ల ద్వారానీటిని సరఫరా చేస్తున్నారని మున్సిపల్ ముఖ్య అధికారి జయన్న అన్నారు. ప్రజలు నీటిని దుర్వినియోగం చేసుకోకుండా కాపాడుకోవాలన్నారు.



ఎలుగుబంటిని తరలిస్తున్న అటవీ అధికారులు

ఆస్పత్రికి ఎలుగుబంటి..

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా, కనకగిరి తాలూకా పరిధిలోని అడవిబావి గ్రామం కొండ ప్రాంతంలో అనారోగ్యంతో ఉన్న ఆడ ఎలుగుబంటిని అటవీ సిబ్బంది గుర్తించి శనివారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అడవిబావి, చక్కతండా, దొడ్డతాండా, సోమసాగర వద్ద అటవీ ప్రాంతంలో స్థానిక రైతులు ద్రాక్ష, కల్లంగడితో పాటు పలు ఉద్యానవన పంటలు సాగుచేశారు. ఈ భాగంలో ఎలుగుబంట్లు అధికంగా సంచరిస్తుంటాయి. ఎలుగుబంట్లు కొండ ప్రాంతాలకు ఆనుకున్న ఉన్న వ్యవసాయ భూముల్లో పడి గాయాలై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ముందుకాళ్ళు నడవడానికి రాలేనంతంగా శక్తిని కోల్పోయినట్లు గుర్తించారు. కమలాపురం ప్రాణి సంగ్రహాలయ ప్రాణి నిపుణులు డాక్టర్ ప్రకృతి ఎలుగుబంటికి స్పృహకోల్పోయే విధంగా చేసి అనంతరం అటవీ సిబ్బంది సహాయంతో ప్రాణి సంగ్రహాలయానికి తరలించారు. ఈ సందర్భంగా రీజనల్ అటవీశాఖ అధికారి సుభాష్ చంద్ర నాయక్, ఉప అటవీ సంరక్షణ అధికారి శ్రీనివాస్, చంద్రశేఖర్ రాఠోడ్, గుండప్ప లమాణి, ఉమేశ్వర, గస్తు అటవీ శాఖ పాలకులు శివకుమార్ వాలి, దావల్ సాబ్ పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగావతి రూరల్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆనేగొంది గ్రామంలో వెలసిన రంగనాథ్ స్వామి మహారథోత్సవాన్ని ఆదివారం సాయంత్రం కన్నుల పండుగలా జరపుకున్నారు. స్థానిలకుతోపాటు జిల్లాలోని చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రథోత్సవానికి తరలి వచ్చారు. స్వామి వారి ఆలయం నుంచి ఎదురుగా ఉన్న అంజనేయ స్వామి ఆలయం వరకు వెళ్ళి తిరిగి రథోత్సవం ఆలయానికి చేరుకుంది. ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేసి భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. మహారథోత్సవంలో శ్రీ కృష్ణదేవ రాయ రాజ వంశస్థులు, రాష్ట్ర కళాసంఘం మాజీ అధ్యక్షురాలు శ్రీమతి లలితా రాణి శ్రీరంగ దేవరాయలు, ప్రదీప్‌కుమార్, రఘురామరాజు, కుప్పరాజు, ఆలయ కమిటీసభ్యులు బాబు, బ్యాంక్ అధ్యక్షుడు వెంకటేశ్, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు, అధికారులు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

కంప్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో పేద ప్రజల కోసం ఏర్పటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీస్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్ సూచించారు. కుడితిని పట్టణంలో హరిగినదోణి బసవన్న గౌడ కాలేజీ ఆవరణంలో రాజవేఖర్, వెంకటరమణబాబు, ఎంఎం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ విభిరంలో ఖలీద్ ముక్కమ్, అన్వర్, గఫూర్, దేవేంద్ర కుమార్ 500 మందికి పైగా రోగులకు చికిత్స అందజేశారు. ఈ శిబిరంలో ప్రతాప్ మహంతేష్, గంగాధర తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

దౌర్జన్యాలు ఆపకపోతే రాష్ట్రవ్యాప్త పోరాటం

● బ్రాహ్మణ సంఘం నాయకుల హెచ్చరిక

బళ్లారి సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జనాభాపరంగా మైనారిటీ అయిన బ్రాహ్మణ సమాజంపై ఇటీవలీ రోజుల్లో దారుణాలు పెరుగుతున్నాయని, ఇకపై ఆపకపోతే పరశురాములుగా మారాల్సి వస్తుందని బళ్లారి బ్రాహ్మణ సంఘం నాయకులు హెచ్చరించారు. నగరంలోని సంగనకల్లు రోడ్డులోని శంకర మఠంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆసంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష(కేఎస్‌ఈటీ) రాయడానికి వెళ్ళిన బ్రాహ్మణ విద్యార్థిని జంధ్యం ధరించారని అనుమతించలేదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తిరిగి పరీక్ష రాయడానికి బోర్డు అనుమతించాలన్నారు. జంధ్యం తీసేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

కుల గణన అశాస్త్రీయం

రాష్ట్రంలో చేపట్టిన కుల గణన అశాస్త్రీయమని, మాసమాజం 15 లక్షల మంది అని కులగణనలో పేర్కొన్నారు అది తప్పని బ్రాహ్మణ సంఘం పేర్కొంది. చాలా మంది ఇంటికి కులగణనకు రాలేదు అని చెప్తున్నారు. అలాంటప్పుడు అది శాస్త్రీయం ఎలా అవుతుందన్నారు. తన సినిమాను ప్రమోట్ చేయడానికి బ్రాహ్మణులపై మూత్ర విసర్జన చేస్తానని చిత్ర దర్శకుడు అనురాగ్ కశ్యప్ చేసిన అసభ్యకరమైన మాటలను సంఘం ఖండిస్తోందన్నారు. ఆయన పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమాజంలో వంటవారు, పూజారులు ఆర్థికంగా వెనుకబడినవారికి ఉద్యోగం, విద్యలో రిజర్వేషన్లు కల్పించాడినికి ఈడబ్ల్యూఎస్ అమలు చేసినప్పటికీ అది ప్రభావితం కాలేదన్నారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేయడానికి అధికారులు ఉద్దేశపూరకంగా తమ సంఘాన్ని వేదిస్తున్నారన్నారు. బళ్లారిలో 25,000 జనాభా ఉంటే అందులో 30 మందికి మాత్రమే ఈసర్టిఫికేట్ లభించిందన్నారు. అది కూడా కేవలం చదువు కోసమే. ఈ రిజర్వేషన్‌లో ఒక్క ఉద్యోగం కూడా దొరకలేదన్నారు. సర్టిఫికేట్ యొక్క చెల్లుబాటు ఒకసంవత్సరం మాత్రమే. ఇతరులకు 5 సంవత్సరాలు ఇస్తారు. లంచంలేకుండా సర్టిఫికేట్ జారీ అయ్యేది కాదని మండిపడ్డారు.

1న శంకర జయంతి

ఆదిశంకరాచార్యుల జయంతిని తత్వవేత్తల దినోత్సవంగా జరుపుకుంటారు. మే 1, 2 తేదీల్లో బళ్లారి నగరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మే 1న సాయంత్రం ఊరేగింపు సత్యనారాయణపేటలోని వెంకటేశ్వర ఆలయం నుంచి ఇందిరా సర్కిల్, గడిగ చెన్నప్ప సర్కిల్, బెంగళూరు రోడ్డుమీదుగా సభాపతి వీదిలోని పాత శంకర మఠం వరకు కళా బృందాలు భజనలు, వేద మంత్రోచ్చారణలు చేపడ్తామన్నారు. మే 2న జయంతిపూజ, ప్రసంగం, ప్రసాద పంపిణీ చేపడ్తామన్నారు. ఈసదర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు బి.కే.సుందర్, కార్యదర్శి బి.కే. మూర్తి, జిల్లాప్రతినిధి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న బొప్పాయి పంట



నేల రాలిన పంటను చూపుతున్న రైతు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హరపనహళ్ళి తాలూకాలో శనివారం రాత్రి భారీ వర్షం గాలి, ఉరుములు, మెరుపులకు పంటలు దెబ్బ తిన్నాయి. జంగమతుంబిఏరిలో కొట్రేష్‌కు చెందిన ఆవు పిడుగుపాటుకు గురై మృతిచెందింది. నందిబేబూరులో విరూపాక్షప్పకు చెందిర అర ఎకరం బొప్పాయి పంట దెబ్బతింది. గ్రామపరిపాలనా అధికారి కవిత సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. మాదాపూర్ గ్రామంలో చౌడాపూర్‌కు చెందిన దేవీరమ్మకు చెందిన బొప్పాయి పంట దెబ్బతింది. కనహళ్ళి గ్రామంలో పాండురంగప్పకు చెందిన 150 బొప్పాయి మొక్కలు, 35కుపైగా బట్టర్‌నట్ మొక్కలు నేలకొరిగాయి. తహసీల్దార్ గిరీశ్ బాబు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయని, నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూస్తామన్నారు.

కేఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాఘవేంద్ర

రాయచూరు ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ రాయచూరు జిల్లా అధ్యక్షుడిగా రాఘవేంద్ర మరో సారి ఎన్నికైయ్యారు. ఆదివారం ఈ మేరకు ఆయనను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాఘవేంద్ర పార్టీ నిర్మాణం కోసం జిల్లాలో ప్రజలను పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తానన్నారు.





కేక్ తినిపించుకుని సంబరాలు చేసుకుంటున్న అభిమానులు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ అనాథాశ్రమంలో తెలుగుదేశం పార్టీ యూత్ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

ట్రామాకేర్ సెంటర్‌లో..

ట్రామా కేర్‌లో రోగులకు చంద్రబాబు నాయుడు అభిమానులు అన్నదానం చేపట్టారు. నాయకులు ట్రస్టు అధ్యక్షుడు గుర్రం రావుమోహన్, చింబిలి ప్రకాష్, ఎన్ ఫణీంద్ర, బుడా మాజీ అధ్యక్షుడు పాలన్న మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు.

ఎన్టీఆర్ ట్రస్టుకు బియ్యం విరాళం

బుడా మాజీ అధ్యక్షుడు పి పాలన్న చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా పది క్వింటాళ్లబియ్యాన్ని రోగుల అన్నదానానికి విరాళంగా అందజేశారు. అనంతరం పాలన్న కూడా జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాలన్న ప్రతి ఒక్కరూ దానధర్మాలను అలవరచుకోవాలన్నారు. వీరితో పాటు హరిబాబు, రామానాయుడు, చిన్నప్పయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు కమ్మసంఘం నాయకులు, అభిమానులు హాజరయ్యారు. విజయనగర జిల్లాలోని తుంగభద్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కుడితిని తోరణగల్లు, సింధనూరు, సిరుగుప్ప తాలూకాల్లో వేడుకలు జరుపుకున్నారు.



వేడుకల్లో విజయ్‌కుమార్

క్రీడలతో మానసికోల్లాసం

● పట్టణ పంచాయతీ అధ్యక్షుడు ఆనంద్



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

సిరుగుప్ప, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలతో ఉల్లాసం ఉత్సాహం అధికమయి ఆరోగ్యం సాధ్యమవుతుందని టెక్కలకోట పట్టణపంచాయతీ అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. ఆదివారం సిరుగుప్పలోని టెక్కలకోట పట్టణంలోని హైస్కూలు గ్రౌండ్‌లో కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీలను ప్రారంభించిన ఆనంద్ మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నరేంద్ర సింహ, బీజేపీ జిల్లా యువ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, క్రీడాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు

కంప్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోకి గ్రామాల్లో వరికోతలు జోరుగా సాగుతున్నాయి. అకాల వర్షాలు కురవడంతో రైతన్నలు పండించిన పంటలు వరి, అరటి, చెరుకు, బొప్పాయి తదితర పంటలు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి కోత మిషన్లు రేట్లు అధిక ధరలు పలుకుతున్నా వర్షం భయంతో రాత్రి, పగలు లెక్క చేయజోరుగా కోతలు కొనసాగిస్తున్నారు. కంప్లి సన్నాపురం, ఎమ్మిగనూరు, జవుకు, దేవసముద్రం గ్రామాల్లో కోతలు సాగుతున్నాయి.



సన్నాపురంలో యంత్రంతో వరికోతలు

విజ్ఞానంతోనే వికాసం

● వేసవి శిబిరంలో ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ



శిబిరంలో మాట్లాడుతున్న ఈరణ్ణ

బళ్లారి సిటీ,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతోనే విద్యార్థుల్లో సంపూర్ణ వికాసం సాధ్యమని ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ అన్నారు. ఆదివారం శ్రీధరగడ్డ గ్రామంలో ఏఐటీఎస్‌ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఒక రోజు పిల్లల వేసవి శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా ఆయన మాట్లాడుతూ నేడు ప్రభుత్వాలు అశ్లీలత, మద్యపానం, క్రూరత్వంతో నిండిన సినిమాలు, సాహిత్యాన్ని అడ్డుకోవడం లేదన్నారు. యువత మద్యం సేవించడం, హత్యలు, దోపిడీ, అత్యాచారం వంటి వ్యసనాల వైపు ఆకర్షితుడవుతున్నారన్నారు. నాటి గొప్ప నాయకులైన ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, సావిత్రి బాయి పూలే, జ్యోతిరావుపూలే, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, ఖుదీరామ్ బోస్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ఆదర్శాలను పిల్లలు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం శిబిరంలో చిన్న కథలు, సినిమా ప్రదర్శనలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏఐటీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.శాంతి, సభ్యులు సమీర్, రఫీక్ విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న గురువులు, విద్యార్థులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, మానవశరీర నిర్మాణంలో ఎండోక్రైన్ గ్రందుళ పాత్ర చాలా ముఖ్యమైనది దీనిని సమతుల్యతలో ఉంచడంలో యోగా చాలా సహాయకారిగా ఉంటుందని యోగా సమితి జిల్లా ఇన్‌చార్జి హంద్రాల్ అన్నారు. ఆదివారం ఉదయం హొసపేటలోని స్థానిక ఫ్రీడమ్ పార్క్‌లో అడ్రినల్ గ్రంథులపై యోగా ప్రభావాలపై రెండు గంటల యోగా శిక్షణతో పాటు అనేక ప్రదర్శనలు ఇచ్చారు. హార్మోన్లు అనేవి అడ్రినల్ గ్రంథులు ఉత్పత్తి చేసే రసాయన దూతలు అని శరీరంలోని ఏ బాగానికి హార్మోన్లు అందాలి అని ఎలా పంపిణీ చేయబడాలి అనే విషయాన్ని నిర్ణయించే ప్రధాన నియంత్రణ కేంద్రం పిట్యూటరీ గ్రంధి అని ఆయన అన్నారు. ఈసందర్భంగా యోగా సమితి ఇండియా రాష్ట్ర ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలచంద్రశర్మ, బళ్లారి ఇన్‌చార్జి రాజేశ్ కర్వా, ఫ్రీడంపార్క్,సీనియర్ యోగా అబ్యాసకులు అశోక్ చిట్‌గార,మంగళమ్మ, కట్టా నంజప్ప, వెంకటేశ్,అనంత్ జోషి, చంద్రిక, శ్రీరామ్, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప 72వ జన్మదినం సందర్భంగా గాంధీనగర్‌లోని స్థానిక సూర్య నివాస్ వృద్ధాశ్రమంలో అభిమానులు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్యారెంటీ యోజన జిల్లా ఉపాధ్యక్షుడు సంగనకల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీహెచ్ మహదేవప్ప అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తూ ఆదరణ పొందుతున్నారన్నారు. కప్పగల్, ఓంకారప్ప, కార్పొరేటర్ నాగలాకేర గోవిందు, కాంగ్రెస్ పార్టీ యువనేత ఓం భవిటీ లోకేష్ పాల్గొన్నారు.

మల్లమ్మ కథనాలు అమోఘం

సిరుగుప్ప, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హేమారెడ్డి మల్లమ్మ కథ కథనాలు సాహిత్యాలు అమోఘమైనవని బసవ భూషణ స్వాములు అన్నారు. ఆదివారం తాలుకాలోని నాగరాళ గ్రామంలో హేమారెడ్డి మల్లమ్మ శివయోగి మఠంలో ఆమె పురాణపఠనం జరిగింది. కళాకారులు జగదీష్ బృందం ఆధ్వర్యంలో పురాణపఠనం ఎంతో వినసొంపుగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భూషణ స్వాములు

హోసూరు జోన్

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు, రూరల్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని శ్రీరామ ఆంజనేయభక్త మండలి ట్రస్టు ఆధ్వర్యంలో సీతారామకల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ 21వ వార్షికోత్సవాలలో శనివారం వినాయక పూజతో ప్రారంభించి విశేషపూజలు నిర్వహించగా ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. హనుమాన్ చాలీసా, విష్ణుసహస్రనామ పారాయణ, శ్రీరామనామ సంకీర్తన కార్యక్రమాలు ఇతర ధార్మిక కార్యక్రమాలు సాగాయి. కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పాటలు పాడారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ నిర్వహించారు.

బంగారప్ప చెరువు నుంచి తాగునీటి విడుదల

రాయచూరు ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రధాన జలాశయంలో నీటి విడుదలను నిలిపివేసిన నేపథ్యంలో జిల్లాలోని పలు చెరువులకు బంగారప్ప చెరువు నుంచి తాగునీటిని విడుదల చేశారు. జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో ఉన్న బంగారప్ప చెరువుకు ఇప్పటికి పూర్తి స్థాయిలో నీరుండడంతో సమీపంలోని పలు చెరువులకు వాటిని అధికారులు కాల్వల ద్వార మళ్లించారు. ఆదివారం డిస్ట్రిబ్యూటరీ నెంబర్ 98, 99 ద్వారా తాగునీరందించే వివిధ గ్రామాలకు బంగారప్ప చెరువు నుంచి వచ్చిన నీటిని విడుదల చేశారు.



కాలువలో ప్రవహిస్తున్న నీరు

కొనసాగుతున్న క్వారీ కార్మికుల సమ్మె



నిరసనలో పాల్గొన్న క్వారీ, క్రషర్ యజమానులు, కార్మికులు

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో క్రషర్, క్వారీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఉపాధి కోల్పోయినవారు రెండు రోజులుగా నిరసనలో భాగస్వామ్యులయ్యారు. జిల్లాలో 103 క్వారీలు, 72కుపైగా క్రషర్లు ఉన్నాయి. క్వారీలనుంచి రాయిని పగులగొట్టి రవాణా చేయడానికి గతంలో యూనిట్‌కు రూ.330 ప్లస్ జీఎస్టీ ఉండేది. దీన్ని 2024 మార్చిలో యూనిట్‌కు రూ.604గా నిర్ణయించారు. ప్రస్తుతం ఒక మెట్రిక్ టన్నుకు రూ.1,347, జీఎస్టీ అదనంగా నిర్ణయించారు. క్వారీలనుంచి రాయి తొలగించేందుకు నిర్ణయించిన ఫీజులను పెంచడాన్ని ఖండించారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ క్రషర్, క్వారీ యజమానుల సంఘం పిలుపుతో నిరవధిక ధర్నా చేపట్టారు. కృష్ణగిరి జిల్లాలో ఈనెల 16నుంచి నిరసన కొనసాగుతోంది. సమ్మె కారణంగా క్వారీలు, క్రషర్లలో పనిచేస్తున్న సుమారు 15వేలమంది కార్మికులు ఉపాధి కోల్పోగా 2వేలకుపైగా ట్రక్కులనుంచి అన్‌లోడ్ కాలేదు. తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు, లారీ డ్రైవర్లు, క్వారీ, క్రషర్ యజమానులు బెంగళూరు జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న శూలగిరి సమీపాన నిరవధిక సమ్మె ప్రారంభించారు. క్వారీల ద్వారా ప్రత్యక్షంగా వెయ్యిమంది, పరోక్షంగా సుమారు 5వేలమంది ఉపాధి పొందుతున్నారు. శనివారం జరిగిన నిరసనలో 3వేలమందికిపైగా పాల్గొనగా ఆదివారం మరింతమంది మద్దతు ఇచ్చారు. శూలగిరి తహసీల్దార్ వలర్మతి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను ఆమోదించేంతవరకు నిరసన కొనసాగుతుందని క్వారీ, క్రషర్ యజమానులసంఘం సభ్యులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆంటోని క్విన్ (జయంతి)



మెక్సికన్-అమెరికన్ నటుడు ఆంటోని క్విన్ 1915 ఏప్రిల్ 21న జన్మించారు. రైటర్‌గా, ఫిల్మ్ డైరెక్టర్‌గాను చిత్రకారుడిగా ప్రతిభ చాటారు. హాలీవుడ్‌లో విభిన్న పాత్రలతో తనదైన గుర్తింపు పొందారు. ఉత్తమ సహాయ నటుడిగా రెండుసార్లు అకాడమీ అవార్డు అందుకున్నారు. జోర్బా ది గ్రీక్ సినిమా ఆస్కార్‌కు ఎంపికైంది. 2001 జూన్ 3న కన్నుమూశారు.

క్వీన్ ఎలిజబెత్ (జయంతి)



బ్రిటీష్ దేశ రాణి ఎలిజబెత్ 2 (ఎలిజబెత్ అలెగ్జాండ్రా మేరీ) 1926 ఏప్రిల్ 21న లండన్‌లోని మేఫైర్ ప్రాంతంలో జన్మించారు. కింగ్‌జార్జ్6, ఎలిజబెత్‌ల తొలి సంతానం ఈమె. 32 సావరన్ స్టేట్స్‌కు రాణిగా 1952 నుంచి 2022వరకు వ్యవహరించారు. బ్రిటీష్ చరిత్రలో 70ఏళ్ల సుదీర్ఘకాలం కొనసాగిన మహారాణిగా గుర్తింపు పొందారు. వివిధ దేశాలనుంచి పలు గౌరవాలు అందుకున్నారు. 96వ యేట 2022 సెప్టెంబరు 8న కన్నుమూశారు. ఆమె అనంతరం పెద్దకుమారుడు చార్లెస్3 కొనసాగుతున్నారు.

మార్క్ ట్వేయిన్ (వర్ధంతి)



కలం పేరు 'మార్క్ ట్వెయిన్'తో పేరొందిన అమెరికాకు చెందిన శామ్యూల్ లాంగార్న్ క్లైమెన్స్ 1835 నవంబరు 30న జన్మించారు. ఆయన నవలలు ప్రపంచ వ్యాప్తంగా పేరొందాయి. ఫాదర్ ఆఫ్ అమెరికన్ లిటరేచర్‌గా విలియం ఫాక్నర్ పిలిచారు. టామ్ సాయర్, హకల్‌బెరి ఫిన్ నవలలు ఫ్రెంచ్‌లోకి సైతం అనువాదమయ్యాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1910 ఏప్రిల్ 21న కన్నుమూశారు.

ఎన్ గోపాలస్వామి (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత ఎన్ గోపాలస్వామి 1944 ఏప్రిల్ 21న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో జన్మించారు. 15వ ఎన్నికల చీఫ్ కమిషనర్‌గా 2006 నుంచి 2009వరకు వ్యవహరించారు. కేంద్రంలో వివిధ హోదాలలో కొనసాగారు. ప్లానింగ్ కమిషన్‌లో విద్యావిభాగం సలహాదారుడిగా వ్యవహరించారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా సొసైటీ, సాట్కామ్ ఇండియా సొసైటీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. రాష్ట్రీయ సంస్కృతి విద్యా పీఠకు చాన్సలర్‌గా నియమితులయ్యారు. హిందూ సంస్కృతి, వేదాల పరిరక్షణకు యునెస్కో నుంచి రూ.5కోట్లు గ్రాంటు సాధించారు.

ఘనంగా రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



రేణుకా యల్లమ్మదేవికి అలంకరణ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ముళబాగిలు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేతాజినగర్‌లో పురాణ ప్రసిద్ధి చెందిన రేణుకా యల్లమ్మ దేవాలయ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఆదివారం ఉదయం గోధూళి లగ్నంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, దేవనాంది తదుపరి పంచగవ్య సమ్మిళనం, రక్షాబంధన, నవగ్రహ పూజ, కళశపూజ, నవదుర్గా పూజ, గణపతి హోమం, నవగ్రహ, మృత్యుంజయ, మహాకాళి మహాలక్ష్మి, సరస్వతి, నవ దుర్గాహోమం, ప్రధాన హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిట్టిస్వామి, అర్చకుడు నిధిస్వామి నేతృత్వంలో పూజా కైంకర్యాలు సాగాయి. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్నసంతర్పణ నిర్వహించారు. అంతకుముందు మహిళలు కళశాలతో అమ్మవారి పూల పల్లకీలో భాగస్వామ్యులయ్యారు. సమాజ సేవకుడు శాంభయ్య కళశాలను మోసిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పూజల్ల పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ మాట్లాడుతూ పురాతన పరంపర, చారిత్రాత్మక ధార్మిక సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరంగా ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా దైవకృపతో మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. ఉత్సవంలో కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జీ మంజు నాథ్, మాజీ మంత్రి హెచ్ నాగేశ్, మాజీ ఎంపీ ఎస్ మునిస్వామి, ప్రము ఖులు ఆదినారాయణ, ఆలంగూరు శివణ్ణ, సీగేహళ్ళి సుందర్, పురసభ మాజీ అధ్యక్షుడు యామణ్ణ, నగరసభ సభ్యులు ఇతర స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

లౌకిక సమాజంలో కులాల విభజన సరికాదు



మండలోత్సవంలో పాల్గొన్న సచ్చిదానంద సరస్వతి స్వామిజీకి సన్మానం

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగరక్షణ, లౌకిక సిద్ధాంతాలను ప్రతిపాదించే సమాజంలో కులాలను విభజించడం సరికాదని హరిహరపుర మఠం స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ అభిప్రాయపడ్డారు. బెంగళూరు జయనగర్ అయోధ్య కల్యాణమండపంలో తిరుమల తిరుపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 'నరుడి నడక నారాయణుడివైపు' అనే నినాదంతో 48వ వార్షిక మండలోత్సవం ఆదివారం జరిపారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ కులాలు, మతాలమధ్య సంఘర్షణ ఎదురైందన్నారు. కులంకంటే మతం ముఖ్యం అనుకుంటేనే దేశం మనుగడ సాధిస్తుందన్నారు. కులం అనేది వృక్షమైతే మతం తల్లి వేరులాంటిదన్నారు. కులాల వ్యామోహంలో మతంపట్ల కూడా నమ్మకాన్ని వీడరాదన్నారు. జీవన వాస్తవాలను తెలుసుకోవాలని, అనిశ్చితి నుంచి బయటకు రావాలని, వ్యాపార మనస్తత్వం వీడి భగవంతుడి పట్ల భక్తితో జీవితంలో ఎదగాలన్నారు. భారతీయ సంస్కృతి కాపాడకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ట్రస్టు అధ్యక్షులు వెంకటగిరిగౌడ, కార్యదర్శి శాంతరాజు, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు డాక్టర్ ఎం జయప్రకాశ్, బీజేపీ నాయకుడు ఆర్ జయదేవ్‌లు పర్యవేక్షించారు.

వైభవంగా సోమేశ్వర ముత్యాల పల్లకీ ఉత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హలసూరులోని పురాతనమైన సోమేశ్వర స్వామి ముత్యాలపల్లకీ ఉత్సవం అంగరంగవైభవంగా సాగింది. శనివారం రాత్రి ప్రారంభమైన ఊరేగింపు ఆదివారం ఉదయం దాకా కొనసాగింది. హలసూరులోని వివిధ ప్రాంతాలలో ఊరేగింపు జరిగింది. ఈ ప్రాంతంలోని సుమారు 60కుపైగా దేవతామూర్తుల విగ్రహాలను సర్వాంగ సుందరంగా తీర్చిన వాహనాలలో ఊరేగించారు. లక్షలాదిమంది భక్తులు భాగస్వామ్యులయ్యారు. హలసూరు ప్రాంతంలో ఎటుచూసినా జాతర వాతావరణం నెలకొంది.



భారీ పల్లకీలో స్వామివారు



సీతారామలక్ష్మణ ఆంజనేయుల ఊరేగింపు ఇలా..



గ్రామదేవత ఊరేగింపు

బళగెరెలో బ్రహ్మరథోత్సవం

చింతామణి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చింతామణి - కోలారు రోడ్డులోని బళగెరె గ్రామం లో కొలువైన శ్రీదేవి భూదేవిసమేత సత్య నారాయణస్వామి దేవాలయ నాల్గో వార్షిక బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణ నడుమ రథోవ్సవం సాగింది. ఆలయంలో ఉదయం నుంచే పలు ధార్మిక కార్యక్రమాలు సాగాయి. రథం వద్ద పలు హోమాదికాలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో తీసుకొచ్చారు. అనంతరం రథంపై కొలువుదీర్చారు. తాళ్లతో రథాన్ని లాగుతూ భక్తులు గోవిందా గోవిందా అంటూ స్మరించారు. మంగళవాయిద్యాలతోపాటు డప్పు కళాబృందం, వీరగాసె, ప్రజా కుణిత, గారడీ బొమ్మలు, కీలుగుర్రాలు వివిధ జానపద బృందా లు రథోత్సవానికి మరింత శోభ తెచ్చాయి. వివిధ గ్రామాలనుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై వచ్చిన బృందాలు భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేయడంతో అన్నసంతర్పణ నిర్వహించారు.



బళగెరె గ్రామంలో రథోత్సవంలో భక్తులు



కళాబృందాల సందడి

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

మహదేవపుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ్యాన్ని వ్యతిరేకించడానికి బదులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని దళితసంఘం ప్రధాన కార్యదర్శి, న్యాయవాది విక్రమ్ అభిప్రాయపడ్డారు. హూడిలో బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక జాగృతి కార్యక్రమం, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని పలు అంశాలు ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. స్వాతంత్ర్యానంతరం ఏ ప్రభుత్వం కూడా రాజ్యాంగంలోని అన్ని అంశాలను సమగ్రంగా ప్రజలకు అవగాహన కల్పించలేదన్నారు. ఆయా మతాలకు అనుగుణంగా ధర్మ గ్రంథాలు ఉన్నాయని, అయితే దేశానికి ఒక్కటే గ్రంథం అది రాజ్యాంగమన్నారు. దళితులు సమైక్యంగా పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ జయంతిలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వందలాదిమంది అభిమానులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హూడి హెచ్‌వీ మంజునాథ్, సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, హూడి రామచంద్ర, నల్లూరహళ్ళి వినోదా, దేవరాజ్ సూర్యవంశి, పరిసర మంజు, మాదేశ తదితరులు పాల్గొన్నారు.



హూడిలో అవగాహనా ర్యాలీలో దళితసంఘం నాయకులు

జీవనశైలిలో మార్పులతో ఆరోగ్యం

విజయపుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో రోటరీ క్లబ్, ఆయుర్వేద ఆసుపత్రి, దొడ్డబళ్ళాపుర ఆత్రేయ ఆయుర్వేద మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవనహళ్ళి ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ కుమార్ ఎస్‌కే మోహన్ మాట్లాడుతూ మన ఆహారం, వ్యవహారాలే మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వీటిలోని లోపాలను సరిదిద్ది బాగు చేయడమే ఆయుర్వేదమన్నారు. కేవలం మందులు ఇవ్వడమే కాక జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మరింత బాగు చేసుకోవచ్చునన్నారు. కూరగాయలు, ఆకు కూరలు విరివిగా వాడడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. తరచూ వైద్య శిబిరాలు నిర్వహించ దలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. రోటరీ సంస్థ అధ్యక్షులు మహేశ్, దేవనహళ్ళి స్కూల్ ఆఫ్ ఏన్సియంట్ వైద్యులు డాక్టర్ విశ్వ, ఇతర వైద్య సిబ్బంది, రోటరీ సంస్థ కార్యదర్శి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బందితో నిర్వాహకులు

నేటి నుంచి ముత్యాలమ్మ దేవి జాతర

దేవనహళ్ళి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండే దొడ్డజాల ముత్యాలమ్మదేవి జాతర ఈనెల 21నుంచి 25వరకు జరగనుంది. ఈనెల 23న అమ్మవారికి అభిషేకం, అమ్మవారి రథోత్సవం కొనసాగనుంది. పులివేషం, పూజాకుణిత, యక్షగానం, వీరగాసె, డొళ్ళుకుణిత, వివిధ కళాబృందాలు పాల్గొంటాయి. 24న మహామంగళారతి, పానకబండి సేవ, 25న సహస్ర నామార్చన, పారాయణ ఉంటాయి.

జింకను వేటాడిన వ్యక్తి అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హనూరు తాలూకాలోని మలెమహదేశ్వర వన్యధామ పరిధిలోని రామాపుర దిన్నళ్ళి మార్గమధ్యంలో జింకను వేటాడిన వ్యక్తిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. రామాపుర గ్రామానికి చెందిన సురేశ్ (35)ను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి వేటకు ఉపయోగించిన ఆటో, జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖచ్చితమైన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా మరో ఇద్దరు వ్యక్తులు గోవింద, మూర్తి పరారయ్యారని సమాచారం. కార్యాచరణలో డీఆర్ఎఫ్ఓ నందీశ్ నేతృత్వంలో సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరు సహా పలు జిల్లాల్లో వర్షం



వర్షంలో ఇబ్బంది పడుతున్న నగరవాసులు

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో బెంగళూరు సహా వివిధ జిల్లాల్లో వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచే బెంగళూరు మేఘావృతంగా మారింది. దక్షిణ జిల్లాల పరిధిలో ఇదే ప్రభావం కొనసాగింది. తీర ప్రాంత జిల్లాల్లో ఉడుపి, ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొడగు, శివమొగ్గ, హాసన్, రామనగర, కోలారు, మండ్య, తుమకూరు, మైసూరు, చిత్రదుర్గ, దావణగెరె జిల్లాల్లో పలు చోట్ల వడగండ్ల వాన కురిసింది. ఈనెల 26వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో ఈనెల 24నుంచి మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బెంగళూరులో సాయంత్రం 4 గంటలకే ఉరుములతో కూడిన వర్షం కురిసింది.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



యలహంకలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని యలహంకలో అభిమానుల సంబరాలు చేసుకున్నారు. దేవాంగం పాపన్న, పృథ్వి, పురుషోత్తం, రెడ్డెప్ప తదితరులు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఏర్పడిన తెలుగుదేశం పార్టీ రథసారథి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో నెంబరువన్‌గా తీర్చాలనే ఆకాంక్షతో పనిచేసే చంద్రబాబు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. చంద్రబాబు, ఎన్టీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. చేనేత కార్మికులు, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. కేశవ నాయుడు, రమణ, ముత్తణ్ణ, రవీంద్ర, మీసాలరెడ్డి, ఆనంద్‌లు భాగస్వాములయ్యారు.

ఘనంగా కోనకుంట్లు శ్రీవారి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామివారికి విశేష అలంకరణ

చింతామణి రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి కోనకుంట్లు గ్రామంలో కొలువై దండకారణ్య అంతర్గత సిద్ధారణ్యగా పురాణంలో పేరొందిన వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకులు అనంత్‌శైన్ నేతృత్వంలో పురోహితుల బృందం ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రసాద వినియోగం, రథానికి కళశస్థాపన, అలంకారోత్సవం, పుష్పాలంకరణ కార్య క్రమాలు సాగాయి. మధ్యాహ్నం భక్తుల గోవింద నామఃస్మరణ మధ్య రథోత్సవం సాగింది. భక్తులు రథంపై అరటిపండు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేయడం తోపాటు అన్న సంతర్పణ నిర్వహించారు. యోగీశ్వర యాజ్ఞవల్క్య దేవాలయసంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ కల్చరల్ ఎక్స్‌పోపై బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 2026 ఫిబ్రవరిలో జరిగే భారత్ గ్లోబల్ కల్చరల్ ఎక్స్‌పోపై ప్రచారంలో భాగంగా ఆదివారం బైక్‌ర్యాలీని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ ప్రారంభించారు. విధానసౌధ వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక ప్రగతిపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. రాష్ట్ర బయో ఇంధన అభివృద్ధి మండలి చైర్మన్ సుధీంద్ర, మాజీ ఎంపీ ఉగ్రప్ప, మాజీ మేయర్ సంపత్‌రాజ్, సునితా, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హిత్తలహళ్లిలో అమెరికా పరిశోధకురాలు



సావితకు వివరిస్తున్న రైతు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హిత్తలహళ్ళి గ్రామాన్ని అమెరికా పట్టు వ్యవసాయ పరిశోధకురాలిగా ఉన్న తాబిత సందర్శించారు. మల్బరీ ఆకు, పట్టుగూళ్లు పెంచే ఇల్లు, చంద్రికల షెడ్‌లను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు పట్టునూలు రీలింగ్ విభాగాలు, ఆటోమేటిక్ రీలింగ్ విభాగాలు ఇతర యంత్రాల పనితీరును పరిశీలించారు. హిత్తలహళ్ళి లోని హెచ్‌కే సురేశ్‌కు చెందిన మల్బరీ తోటను సందర్శించగా అక్కడి వివరాలను తాబితకు వివరించారు. పనివారి కొరత, ఇతరత్రా సమస్యలను ఆరా తీశారు. ఇతర రైతుల అభిప్రాయాలను సేకరించారు.